ఈనాడు
epaper.eenadu.net

# గ్రామీణ అంకురాలకు ప్రోత్సాహం

- కాకతీయ శాండ్‌బాక్స్‌కు రూ.20 కోట్లు
- అందించిన కన్వాల్ రేఖి





ఈనాడు - హైదరాబాద్

గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవస్థాపకులను ప్రోత్సహించడంతో పాటు, వాటిని వృద్ధి దశలోకి నడిపించేందుకు కాకతీయ శాండ్ బాక్స్ రూ.20 కోట్లు అందుకుంది. ఇన్వెంచస్ క్యాపిటల్ పార్ట్‌నర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కన్వాల్ రేఖి ఈ మద్దతు నిధులను అందించారు. ఈ మొత్తంతో నిజామాబాద్‌లో కన్వాల్ రేఖి రూరల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ స్టార్టప్ సెంటర్ (కేఆర్ఈఎస్‌టీ)ని ఏర్పాటు చేయబోతున్నట్లు కాకతీయ శాండ్‌బాక్స్ వెల్లడించింది. కేఆర్ఈఎస్‌టీ కాకతీయ శాండ్‌బాక్స్ ఆధ్వర్యంలో నడుస్తుంది. బుధవారం టై గ్లోబల్ సమ్మిట్ -2022లో నిధుల కేటాయింపు విషయాన్ని కన్వాల్ రేఖి ప్రకటించారు. గ్రామాల్లోని ప్రతిభావంతులైన యువకులకు మార్గనిర్దేశం చేసేందుకు ఈ కేంద్రం తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. కన్వాల్ ఆధ్వర్యంలోని వెంచర్ క్యాపిటలిస్ట్ సంస్థ నాస్‌డాక్‌లో నమోదయ్యింది. 'టై' ప్రపంచంలో అతి పెద్ద నెట్‌వర్క్‌గా మారడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 'ది ఎంట్రప్రెన్యూర్‌షిప్ పండిట్'గా ఈయనకు పేరుంది.

2047 నాటికి దేశంలో కోటి అంకురాలు ఏర్పాటవ్వాలనే లక్ష్యం చేరుకోవాలంటే గ్రామీణ ప్రాంతాలే కీలకమని కన్వాల్ వివరించారు. కాకతీయ శాండ్‌బాక్స్ ఈ దిశగా పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. కాకతీయ శాండ్‌బాక్స్ సహ వ్యవస్థాపకుడు రాజు రెడ్డి మాట్లాడుతూ 'ఉత్తర తెలంగాణలో గత తొమ్మిదేళ్లుగా వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, విద్య, గ్రామీణ జీవనోపాధి రంగాల్లో సమస్యలను పరిష్కరించే సంస్థల వ్యవస్థాపకులకు మేము మద్దతు ఇస్తున్నా'మని పేర్కొన్నారు. 10,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో తాము నిర్మించబోతున్న కేంద్రంలో 100కు పైగా సంస్థలు పనిచేసుకునేలా కో-వర్కింగ్ స్థలం ఉంటుందన్నారు. ఒకేసారి 30కి పైగా అంకురాలు ఇందులో ఏర్పాటవుతాయని పేర్కొన్నారు. అంకురాలకు నెట్‌వర్కింగ్, మార్గనిర్దేశకత్వం, పెట్టుబడుల సమీకరణలో తోడ్పాటునందిస్తామని వెల్లడించారు.

## 100 అంకురాలను ఎంపిక చేసిన టై గ్లోబల్

వినూత్న ఆవిష్కరణలతో ప్రతిభ చూపిన అంకురాలను టీజీఎస్100గా గుర్తించారు. మూడు రోజులపాటు జరిగిన టై గ్లోబల్ సదస్సు - 2022 బుధవారంతో ముగిసింది. గత ఆరు నెలలుగా ఎన్నో అంకురాలను పరిశీలించి, 14 దేశాలకు చెందిన 100 అంకురాలను ఎంపిక చేసినట్లు టై గ్లోబల్ కో-ఛైర్ మురళీ బుక్కపట్నం వెల్లడించారు. వీటికి మార్గనిర్దేశకత్వం, నెట్‌వర్కింగ్, పరిశ్రమతో అనుసంధానం, నిపుణుల సలహాలు లభిస్తాయని పేర్కొన్నారు. అగ్రిటెక్, గేమింగ్, వెబ్ 3.0, మెటావర్స్, హెల్త్, ఇ-కామర్స్ తదితర రంగాల్లో ఈ సంస్థలున్నాయని టై హైదరాబాద్ ప్రెసిడెంట్ సురేశ్ రాజు తెలిపారు.